## 36 కిలోల బంగారం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

కొండాపూర్, అక్టోబర్ 17 : చందానగర్ పోలీసులు సోమవారం రాత్రి గంగారం ఉమెన్స్ వరల్డ్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, బీవీజీ లాజిస్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన వాహనంలో సరైన పత్రాలు (బిల్లులు) లేకుండా తరలిస్తున్న 28.9 కిలోల బంగారు ఆభరణాలు, 25.7 కిలోల వెండి ఆభరణాలు పట్టుబడ్డాయి. ఈ ఆభరణాలు కల్యాణ్ జ్యువెల్లర్స్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువెల్లర్స్, లలిత జ్యువెల్లర్స్, రిలయన్స్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్, వివాజ్ జ్యువెల్లర్స్‌కు చెందినవని వాటిని తరలిస్తున్న వ్యక్తులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం ఆదాయపన్ను శాఖకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

- **చర్లపల్లి :** కుషాయిగూడ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రాంపల్లి దాయరకు చెందిన హనుమంత్‌రెడ్డికి చెందిన కారులో రూ.20 లక్షల నగదు లభించింది. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారమిచ్చారు.
- **శామీర్‌పేట:** జీనోమ్ వ్యాలీ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఒక వాహనంలో తరలిస్తున్న 8 కిలోల బంగారం, 9 కిలోల వెండి పట్టుబడింది. సరైన పత్రాలు చూపకపోవడంతో బంగారం, నగదు సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.
- **కవాడిగూడ :** హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో దోమలగూడ పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5 లక్షల నగదు పట్టుబడింది.

## కారుకు ఆన్ గవర్నమెంట్ డ్యూటీ స్టిక్కర్

- ఏపీ టూ మహారాష్ట్ర.. గంజాయి రవాణా
- ఇద్దరి అరెస్టు.. 80 కిలోల గంజాయి స్వాధీనం

సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): కారుకు ఆన్ గవర్నమెంట్ డ్యూటీ స్టిక్కర్‌ను అంటించి.. ఏపీ టూ మహారాష్ట్ర వయా హైదరాబాద్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ, ఉప్పల్ పోలీసులు కలిసి పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి 80 కిలోల గంజాయిని, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. సీపీ డీఎస్ చౌహాన్ కథనం ప్రకారం.. బండ్లగూడ నివాసి కుంచల శ్రీను మేస్త్రి పనిచేస్తున్నాడు. గతంలో ఇతడిపై గంజాయికి సంబంధించిన ఐదు కేసులు ఉన్నాయి. జైలుకు వెళ్లి వచ్చినా.. అతడి బుద్ధి మారలేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత తిరిగి గంజాయి స్మగ్లింగ్ మొదలు పెట్టాడు. ఈ క్రమంలోనే ఏపీకి చెందిన కైల రామును పరిచయం చేసుకున్నాడు. రాముకు కొంత ఆర్థిక సహాయం చేసి.. బొలేరో వాహనం కొనిపించాడు. ఆ బొలేరాలో ధన్‌రాజ్ అనే వ్యక్తితో కలిసి విశాఖపట్టణం, సిలేర్‌లో గంజాయి కొనుగోలుచేసి.. హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు వెళ్తున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా బొలేరా వాహనానికి 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అనే స్టిక్కర్‌ను అతికించారు. కాగా, విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ బృందం ఉప్పల్ పోలీసులతో కలిసి ఉప్పల్ భాగయత్‌లో కారును ఆపి తనిఖీలు చేశారు. అందులో 80 కిలోల గంజాయి ఉండటంతో వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కుంచల శ్రీను, కైల రామును అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు.

## 'సజ్జల చాటున.. గంజాయి సరఫరా'

### ఎస్ఓటీ పోలీసుల దాడిలో నిందితుడి అరెస్టు

సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): సజ్జల బ్యాగ్‌లో డ్రగ్స్ దాచి.. రాజస్థాన్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న కార్పెంటర్‌ను ఎల్బీనగర్ ఎస్ఓటీ, నేరేడ్‌మెట్ పోలీసులు కలిసి పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన మనోజ్ కార్పెంటర్. హుస్సేనీఆలంలో ఉంటున్నాడు. జగద్గిరిగుట్ట పోలీసులు డ్రగ్స్ కేసులో గతంలో అరెస్టు చేశారు. మనోజ్‌కు డ్రగ్స్ అలవాటు ఉంది. తరచూ రాజస్థాన్‌కు వెళ్లి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొని హైదరాబాద్‌కు వచ్చి అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. రాజస్థాన్ నుంచి వచ్చే సమయంలో సజ్జలు కూడా తీసుకువస్తాడు. ఆ సజ్జల బ్యాగుల్లో ఎండీఎంఏ డ్రగ్స్‌ను దాచి.. తీసుకువస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నిందితుడు నేరేడ్‌మెట్ బస్టాండ్‌లో కస్టమర్ కోసం ఎదురు చూస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## లోదుస్తుల్లో దాచుకొని.. బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17 : లోదుస్తుల్లో దాచుకొని తరలిస్తున్న 650 గ్రాముల బంగారాన్ని మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కస్టమ్స్ అధికారులు కథనం ప్రకారం.. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడు గోల్డ్ చైన్‌తో పాటు రెండు బంగారు బిస్కెట్లను తన లోదుస్తువుల్లో దాచుకొని తీసుకువచ్చాడు. అతడిపై అనుమానం రావడంతో కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అతడి వద్ద 650 గ్రాముల బంగారం లభించింది. పట్టుబడిన బంగారం విలువ రూ. 39.61 లక్షలు ఉంటుందని వివరించారు. ఈ మేరకు ప్రయాణికుడిని అరెస్టు చేసి, కేంద్ర కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రూ.పది లక్షలు మించిన..

# లావాదేవీలపై నజర్.!

- నగదు మూలాలను గుర్తించండి
- గత ఆరు నెలల్లో ఆర్‌బీఐ, పోస్టాఫీసు ద్వారా జరిగిన నగదు లావాదేవీలను అందజేయండి
- బ్యాంకు, ఆర్‌బీఐ, ఆదాయపన్ను, విజిలెన్స్ అధికారులతో సమీక్ష
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి తనిఖీలు చేపట్టాలి : జిల్లా ఎన్నికల అధికారి


అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి నగర వ్యాప్తంగా తనిఖీలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు, ఆర్‌బీఐ, ఇన్‌కం ట్యాక్స్, విజిలెన్స్, ఆర్టీఏ, ఎన్‌సీబీ అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నగదు, లిక్కర్ తరలింపును అడ్డుకోవడానికి పార్సిల్, కొరియర్, ట్రైన్ చెకింగ్, సరిహద్దుల వద్ద నిఘా పెట్టాలని రోనాల్డ్ రోస్ తెలిపారు. అన్ని వైన్ షాపుల వద్ద సీసీ కెమెరాలను అమర్చి.. కంట్రోల్ రూం ద్వారా మానిటరింగ్ చేయాలన్నారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖ ద్వారా హాట్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని గోడౌన్‌లను చెక్ చేసి సీసీ కెమెరాలను అమర్చాలన్నారు. 18 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ద్వారా తనిఖీలు చేపట్టాలని రోనాల్డ్ రోస్ సూచించారు.

### ఎక్కువ మొత్తంలో నగదు బదిలీలు..

ఆర్‌బీఐ, పోస్టాఫీసు ద్వారా గత ఆరు నెలల్లో ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిగిన వివరాలను అందించాలని ఎన్నికల అధికారి తెలిపారు. యూపీఐ (గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం) ద్వారా ఒకే అకౌంట్ నుంచి ఎక్కువ అకౌంట్లకు నగదు బదిలీలు జరిగిన వాటి వివరాలను అందించాలని తెలిపారు. రూ. 10 లక్షలకు మించి ఉన్న నగదు లావాదేవీలపై ఇన్‌కంట్యాక్స్ శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బ్యాంకులు రూ.10 లక్షలకు మించి నగదు లావాదేవీలు, ఎక్కువ మొత్తంలో నగదు బదిలీ వివరాలను అందించాలని తెలిపారు. బ్యాంకుల ద్వారా నగదు మూలాలను గుర్తించి సమాచారం అందించాలని తెలిపారు. ఏటీఎంలలో నగదు డిపాజిట్ చేసే వాహనాలపై నిఘా, కెమెరాలను ఏర్పాటు చేయాలని రోనాల్డ్ రోస్ తెలిపారు.

### గ్రీవెన్స్ సెల్‌కు సమాచారం ఇవ్వండి..

అక్రమంగా తరలించే నగదును సీజ్ చేసి డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ సెల్‌కు సమాచారమివ్వాలని రోనాల్డ్ రోస్ తెలిపారు. ఆదాయపన్ను శాఖ అధికారులు అనుమానిత నగదు లావాదేవీలపై పూర్తి విచారణ చేయాలన్నారు. విజిలెన్స్ ద్వారా అక్రమ నగదుపై నిఘా ఉంచాలని సూచించారు. ఆర్టీఏ అధికారులు 18 చెక్ పోస్టులలో తమ సిబ్బందిని నియమించాలని తెలిపారు. సరిహద్దు ప్రాంతాలైన పెద్ద అంబర్‌పేట, ఘట్‌కేసర్ నుంచి తరలిస్తున్న డ్రగ్స్‌పై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సిగరేట్లు, గంజాయి సరఫరా ప్రదేశాలలో నిఘా ఉంచాలన్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు ఇండస్ట్రియల్ యూనిట్లు, గోడౌన్ ప్రదేశాలలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న బంగారం, వెండిపై నిఘా ఉంచాలని, ఈ- వేబిల్స్, ఎఫ్ఎంసీజీ ద్వారా హోల్‌సేల్ మార్కెట్లలో తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ ద్వారా పట్టుబడిన నగదుకు సంబంధిత వాహనాలను రికార్డింగ్ చేసి.. సమయం, వెహికిల్ నంబర్‌ను పొందుపర్చాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, అడిషనల్ కమిషనర్ ఎలక్షన్ శంకరయ్య, నోడల్ అధికారులు, బ్యాంక్, ఆదాయపన్ను శాఖ, ఈడీ, ఆర్టీఏ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అనుమానమే పెనుభూతమైంది

- భార్యను చంపి.. ఆత్మహత్యకు పాల్పడిన భర్త
- అనాథలైన ఇద్దరు పిల్లలు..
- నాగోల్ పీఎస్ పరిధిలో ఘటన



హత్యకు గురైన సంతోష, ఆత్మహత్య చేసుకున్న రాజు (ఫైల్)

మన్సూరాబాద్, అక్టోబర్ 17: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త అమానుషంగా ప్రవర్తించాడు. భార్య గొంతు కోసి చంపడమే కాకుండా.. తాను బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు క్షణికావేశంలో చేసిన పనికి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, ఆమనగల్ మండలం, ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన తెల్గమల రాజు (42) వివాహం 20 ఏండ్ల కిందట కందుకూరు మండలం, ముచ్చర్ల గ్రామానికి చెందిన సంతోష (38)తో జరిగింది. జీవనోపాధి కోసం నగరానికి వచ్చిన ఈ దంపతులు నాగోల్‌లోని సాయినగర్‌కాలనీ రోడ్డు నం. 2ఏలో ఉంటున్నారు. వీరికి 16 ఏండ్ల కూతురు సింధు, 12 ఏండ్ల కుమారుడు సాయిరాం ఉన్నారు. సింధు ఇంటర్ మొదటి సంవత్సరం, సాయిరాం 9వ తరగతి చదువుతున్నారు. రాజు లారీని నడుపుతుండగా, సంతోష ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పని చేస్తుంది. రాజు ఇటీవల మూడు స్కూల్ వ్యాన్లు కొనుగోలు చేసి, నష్టాల్లో కూరుకుపోయాడు. వాటిని అమ్మినా ఆర్థిక ఇబ్బందులు తీరలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతి రోజు మద్యం తాగి భార్యను హింసించాడు. దీనికితోడు భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని.. తరచూ ఆమెను కొట్టడం మొదలుపెట్టాడు. నెల రోజుల కిందటే సంతోష ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా చేరింది. కొందరితో ఆమె సన్నిహితంగా ఉంటున్నట్లు రాజుకు అనుమానం వచ్చింది. ఆమెను ఎలాగైనా కడతేర్చాలనుకున్నాడు. పిల్లలు పెద్ద వారు కావడంతో.. ఇంట్లో వారు ఉన్న సమయంలో తన ఆటలు సాగవని గ్రహించాడు. సోమవారం సాయంత్రం సాయినగర్‌కాలనీలోని తన ఇంటికి చికెన్ తీసుకువచ్చి భార్యతో వండించాడు. వండిన చికెన్‌ను తీసుకుని పిల్లలు, భార్యతో కలిసి రాత్రి 8 గంటల సమయంలో కర్మాన్‌ఘాట్, తపోవన్‌కాలనీలో ఉండే తన సోదరి మంజుల ఇంటికి వెళ్లాడు. విందు ముగించుకున్న అనంతరం పిల్లలను అక్కడే వదిలి.. రాత్రి 11 గంటలకు భార్య సంతోషతో కలిసి సాయినగర్‌కాలనీకి చేరుకున్నాడు.

### పథకం ప్రకారమే భార్య హత్య..

సోదరి ఇంటికి వెళ్లిన రాజు మద్యం తాగి.. భోజనం ముగించుకున్న అనంతరం అర్ధరాత్రి సమయంలో భార్యతో కలిసి సాయినగర్‌కాలనీకి చేరుకున్నాడు. పిల్లలు ఇంట్లో లేకపోవడంతో సంతోషను హతమార్చేందుకు సరైన సమయంగా భావించాడు. మద్యం మత్తులో ఉన్న రాజు ఆదమరిచి నిద్రపోయిన భార్యను కిరాతంగా కత్తి పీటతో గొంతు కోసి, రోకలి బండతో తల, ముఖంపై కొట్టి చంపాడు. అనంతరం అక్కడి నుంచి తన బైక్‌పై కర్మాన్‌ఘాట్‌లో ఉంటున్న సోదరి మంజుల ఇంటికి వెళ్లాడు. అప్పటికీ అందరూ నిద్రలో ఉన్నారు. ఇంటి బయటే రాజు కూర్చుండి పోయాడు. మద్యం మత్తు నుంచి బయటపడిన రాజుకు భయం పట్టుకుంది. భార్యను హతమార్చిన తనను ఎవరూ క్షమించరని గ్రహించిన రాజు.. తన సోదరి నివాస ముండే బిల్డింగ్ మూడో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

### రాజు ఆత్మహత్యతో వెలుగులోకి..

మంజుల ఇంటి యజమాని మంగళవారం ఉదయం 6 గంటలకు నిద్రలేచి బయటకు వచ్చాడు. ఇంటి ముందు ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండటాన్ని గమనించాడు. వెంటనే అద్దెకు ఉండే వారిని నిద్రలేపగా.. మృతి చెందిన వ్యక్తి తన సోదరుడిగా మంజుల గుర్తించింది. విషయాన్ని రాజు భార్య సంతోషకు తెలిపేందుకు ఫోన్ చేయగా.. ఆమె ఎంతకీ లిఫ్ట్ చేయలేదు. సాయినగర్‌కాలనీలోనే నివాసముండే రాజు మేన బావ విష్ణుకు మంజుల ఫోన్ చేసి విషయాన్ని చెప్పింది. రాజు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలిపేందుకు సంతోషకు ఫోన్ చేయగా.. ఆమె లిఫ్ట్ చేయడం లేదని.. వెంటనే అక్కడికి వెళ్లి సంతోషను తీసుకుని రావాలని కోరింది. రాజు ఇంటికి తాళం వేసి ఉండటాన్ని విష్ణు గ్రహించాడు. అనుమానంతో డోర్ లాక్‌ను కోసి ఇంట్లోకి వెళ్లి చూడగా.. సంతోష రక్తపు మడుగులో పడి ఉంది. విషయాన్ని తెలుసుకుని అక్కడి చేరుకున్న సంతోష బంధువులు రక్తపు మడుగులో పడి ఉన్న ఆమెను చూసి బోరున విలపించారు.

### అనుమానంతోనే హత్య..

సంతోషపై అనుమానం పెంచుకున్నాడని.. ఆమెను తరచూ కొట్టే వాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. అనుమానంతోనే హత్య చేశాడని ఆరోపించారు. నిత్యం మద్యం తాగే అలవాటు ఉన్న రాజు.. మత్తులోనే భార్యను చంపి తప్పించుకునేందుకు దారి లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంతోష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.